క్లుప్తంగా

డీఎస్‌డీఓగా యతిరాజ్



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారిగా ఆర్కే యతిరాజ్ నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని డీఎస్‌ఏ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్రీడా రంగ అభివృద్ధికి, క్రీడాకారుల ఉన్నతికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ



మాట్లాడుతున్న లలితా శివజ్యోతి

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో గురువారం తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ లలితా శివజ్యోతి మాట్లాడుతూ తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా పలువురికి జీవనోపాధి అందించడం జరుగుతుందన్నారు. శిక్షణలో 52 మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇంధన పొదుపు అందరి బాధ్యత



పోస్టర్లను ప్రదర్శిస్తున్న జేసీ తదితరులు

నెల్లూరు(దర్గామిట్ట): ఇంధన పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యతని జేసీ రోణంకి కూర్మనాథ్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు పోస్టర్లను గురువారం నెల్లూరులో ఆవిష్కరించారు. 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు జరుగుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అధికారులు వి.విజయ, బాలచంద్ర, శ్రీధర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠనాథ అలంకారంలో రంగనాథుడు



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పగల్‌పత్తు ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం రంగనాథుడు వైకుంఠనాథ అవతారంలో దర్శనమిచ్చారు. ఉభయదేవేరులతో సర్వాలంకార శోభితంగా కొలువైన స్వామిని భక్తులు దర్శించుకున్నారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారి జె.శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి డి.వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ ఐ.శివకుమార్ ఆచారి, మాజీ సభ్యులు పాల్గొన్నారు. ఉభయకర్తలుగా వెంకటేశ్వర్లు వ్యవహరించారు.

వైభవంగా అయ్యప్పస్వామి మండల పూజలు



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో మండల పూజోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం పూజలు, ఉత్సవాలు, సేవలను విశేషంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అయ్యప్పను దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా దేవరాల సుబ్రహ్మణ్యం, మస్తానమ్మ, కొండ్రెడ్డి శ్రీనివాసులురెడ్డి, కాంతమ్మ, బయ్యపురెడ్డి ఈశ్వర్ రెడ్డి, పద్మ, దేవరాల శ్రీనివాసులు, రాజేశ్వరి, లోకేశ్‌రెడ్డి తదితరులు వ్యవహరించారు. కార్యక్రమాలను శ్రీస్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషగిరిరావు, కె.వెంకటరత్నం, కోశాధికారి జి.రత్నయ్య, బి.మురళీమోహన్‌రెడ్డి పర్యవేక్షించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్
- వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై సమీక్ష



ఆహ్వానపత్రికలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్, వివిధ శాఖల అధికారులు

నెల్లూరు(బృందావనం): 'ఈనెల 23వ తేదీన ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా తల్పగిరి రంగనాథస్వామిని దర్శించుకునేందుకు తరలి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలి. ఇందుకోసం అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలి.' అని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్ ఆదేశించారు. రంగనాయకులపేటలోని రంగనాథస్వామి దేవస్థానంలో అనిల్ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. తొలుత వైకుంఠ ఏకాదశి పర్వదిన ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేకువజామున 3.30 గంటల నుంచే వైకుంఠ దర్శనం, ప్రత్యేక, ఉచిత దర్శనం భక్తులకు కల్పిస్తున్నామన్నారు. దర్శనం కోసం వచ్చే భక్తులకు టికెట్లపై టైం సూచిస్తామన్నారు. ఎక్కువ సమయం క్యూలో వేచిచూడాల్సిన అవసరం ఉండదన్నారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్, నగరపాలక సంస్థ, దేవాదాయ ధర్మాదాయ, అగ్నిమాపక తదితర శాఖలకు చెందిన అధికారులు తాము చేసే ఏర్పాట్లను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుంజి జయలక్ష్మి, షేక్ అస్మ, ఏపీ ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొణిదెల సుధీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇలపాక శివకుమార్ ఆచారి, మంచికంటి శ్రీనివాసులు, జిల్లా దేవాదాయ శాఖ అధికారి జె.శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పూడికతీత పనులు

- కమిషనర్ వికాస్ మర్మత్



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): భారీ వర్షాలకు రోడ్లపై నీరు నిల్వ లేకుండా, వరద నీటి ప్రవాహం సాఫీగా సాగేలా అన్ని ప్రధాన కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. గురువారం ఆయన ఇంజినీరింగ్, శానిటేషన్ టౌన్ ప్లానింగ్ విభాగాలధికారులతో కలిసి కేవీఆర్ పెట్రోల్ బంక్ కూడలి, మాగుంట లేఅవుట్, ముత్తుకూరు రోడ్డు, చిల్డ్రన్స్ పార్కు, నేషనల్ హైవే తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సూచించారు. వర్షాలకు ముంపునకు గురైన ప్రాంతాల్లో అంటురోగాలు వ్యాపించకుండా బ్లీచింగ్ ప్రక్రియ, దోమల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అకాల వర్షాలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(బారకాసు): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్రను నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ నగరంలోని మినర్వా గ్రాండ్ హోటల్లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మిచాంగ్ తుఫాన్ కారణంగా నెల్లూరు వ్యాప్తంగా కలిగిన నష్టం అంచనాలపై వారు చర్చించారు.

న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు

నెల్లూరు(లీగల్): ఏపీ భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలంటూ నగరంలోని జిల్లా కోర్టు వద్ద నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్య యాదవ్ ఆధ్వర్యంలో వీటిని చేస్తున్నారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖరరెడ్డి పాల్గొని మాట్లాడారు. పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ సమావేశం రేపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈనెల 16వ తేదీ శనివారం ఏపీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా సమావేశం నెల్లూరు మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న గుర్రం జాషువా కవితా పీఠంలో జరుగుతుందని ఆ అసోసియేషన్ సీనియర్ నాయకుడు మందా బాబ్జీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని, అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైమ్): పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన గురువారం వేకువజామున నగరంలోని విజయమహల్ గేటు సమీపంలో నెల్లూరు వైపు వెళ్లే రైలుపట్టాలపై చోటు చేసుకుంది. మృతుడి వయసు 65 నుంచి 70 ఏళ్లలోపు ఉండవచ్చు. బ్లూ కలర్‌పై వైట్ కలర్ చుక్కలు కలిగిన ఫుల్ హ్యాండ్స్ చొక్కా, వైట్ కలర్ పంచె ధరించి ఉన్నాడు. నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న రంగారెడ్డి

నెల్లూరురూరల్: నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్ రెడ్డి సూచనలతో 31వ డివిజన్ రామకోటయ్య నగర్‌లో గురువారం రూ.31 లక్షల సీసీ రోడ్డు పనులకు విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆదాల పని చేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఆయన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

- రూరల్ పరిధిలోని 17వ డివిజన్ ఆకుతోట ప్రాంతంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. రంగారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు.

కలెక్టరేట్ వద్ద ఆశావర్కర్ల ధర్నా



నెల్లూరు(దర్గామిట్ట): కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్, సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. వీఆర్సీ గ్రౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్, ఆశావర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడారు. ధర్నాకు రైతు సంఘం నాయకుడు మూలి వెంగయ్య, విద్యుత్ రంగం జిల్లా కార్యదర్శి జాకీర్, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమారి, ఎస్కే మస్తాన్‌బీ తదితరులు మద్దతు తెలిపారు. సీఐటీయూ నాయకులు అల్లాడి గోపాల్, కె.పెంచలనరసయ్య, ఈ.మధుసూదన్, భాగ్యరేఖ, వసుంధర్, మేరి, రేణుక, అరుణ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల నిరసన



నెల్లూరు(బారకాసు): తమ సమస్యలను పరిష్కరించాలంటూ అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగులు గురువారం నెల్లూరు నగరంలోని ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐపీఎస్సీఎస్టీ గౌరవాధ్యక్షుడు దుడ్డు రమేష్‌బాబు మాట్లాడుతూ ఏఐజీడీఎస్‌యూ, ఎన్‌యూజీడీఎస్ సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సమ్మె జరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జీడీఎస్‌ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్పందించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. జిల్లా డీవీఎంసీ మాజీ సభ్యుడు, న్యాయ పోరాట సమితి రాష్ట్ర నాయకుడు కొప్పోల రఘు, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య పాల్గొని సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐజీడీఎస్‌యూ గౌరవాధ్యక్షుడు ఇస్మాయిల్, కోశాధికారి అంజాద్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ (ఎన్‌యూజీడీఎస్) తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనకు గుణపాఠం చెప్పడం ఖాయం

- ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి



పొదుపు మహిళల సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

నెల్లూరు రూరల్: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖల ప్రభుత్వ సలహాదారు నాగార్జున రెడ్డి అన్నారు. గురువారం ఆయన నెల్లూరులో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌ను ప్రజలు నమ్మడం లేదన్నారు. ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాలను అందరూ తిప్పికొట్టాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీలన్నింటిని నెరవేర్చారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు అనేక హామీలిస్తారని, వాటిని నమ్మవద్దన్నారు.

మహిళలకు అండగా ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు అన్ని విధాలా అండగా ఉందని ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం రూరల్ మండలంలోని పొదుపు సమాఖ్య గ్రూపులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. నాడు – నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా మారిపోయాయన్నారు. చంద్రబాబు హయాంలో నాలుగు వేల ప్రభుత్వ స్కూళ్లు మూతపడ్డాయన్నారు. అనంతరం పొదుపు మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. సమావేశంలో రూరల్ ఎంపీపీ విజయకుమార్, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఎల్‌డీఓ వసుమతి, ఏపీఎం సరి తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

దేవరపాళెంలోని ప్రభుత్వ పాఠశాల, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను నాగార్జునరెడ్డి గురువారం పరిశీలించారు. ములుముడిలోని జెడ్పీ హైస్కూల్లో డిజిటల్ విద్యా బోధనను చూశారు. మధ్యాహ్న పథక భోజనాన్ని పరిశీలించి స్వయంగా విద్యార్థులకు వడ్డించారు. సౌత్‌మోపూరు పీహెచ్‌సీని పరిశీలించారు. సచివాలయంలో రికార్డులు చూశారు. కందమూరు సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ప్రజా శ్రేయస్సే లక్ష్యం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



చెక్కును అందజేస్తున్న మంత్రి కాకాణి

నెల్లూరు(దర్గామిట్ట): ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శ్రీహరి అనే వ్యక్తి వెంకటాచలం మండలం నిడిగుంటపాళెంలో విద్యుత్ శాఖలో లైన్‌మన్‌గా పనిచేస్తుంటాడు. విద్యుత్ లైన్లు మరమ్మతులు చేస్తుండగా అతను తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. కాగా స్పందించిన మంత్రి వైద్యానికి ఖర్చు అయిన మొత్తం రూ.16,59,461ను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించారు. చెక్కును గురువారం నెల్లూరులో శ్రీహరికి కాకాణి అందజేశారు. కార్యక్రమంలో ఈతఈ జయకృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేద్దాం



కరపత్రం అందజేస్తున్న డిప్యూటీ మేయర్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాల్సిన అవసరం ఉందని నగర డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్ అన్నారు. నగరంలోని 53వ డివిజన్ గాంధీ గిరిజనకాలనీలో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సీఎంగా వైఎస్ జగన్, నగర ఎమ్మెల్యేగా అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించుకునే బాధ్యత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అనంతరం అభివృద్ధి, పథకాలను తెలియజేసే బోర్డులను ఏర్పాటు చేశారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ సుజాత, నగర కార్పొరేషన్ కో–ఆప్షన్ సభ్యుడు జమీర్ అహ్మద్, బాగి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

9, 16, 46 డివిజన్లలో..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు 9, 16, 46 తదితర డివిజన్లలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 9వ డివిజన్ 9/4 పుట్టవీధి సచివాలయ పరిధిలో కార్పొరేటర్ దామవరపు రాజశేఖర్ సంక్షేమం, అభివృద్ధిని వివరించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. 16వ డివిజన్‌లో 16/2 రాంజీనగర్–1 సచివాలయ పరిధిలో కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, 46వ డివిజన్ 46/3 బృందావనం సచివాలయ పరిధిలో కార్పొరేటర్ వేలూరు మహేష్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజలకు మరింత చేరువగా పోలీస్ సేవలు

- బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా వీరానాయక్ బాధ్యతల స్వీకరణ



డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీరానాయక్

నెల్లూరు(క్రైమ్): పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసి చట్టవ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేస్తామని బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎల్.వీరానాయక్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. దీంతో సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వర రెడ్డి, ఏఎస్పీ డి.హిమవతి, నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వీరానాయక్ ఆర్‌ఎస్‌ఐగా 2002లో పోలీస్ శాఖలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం సివిల్‌కు కన్వర్షన్ అయ్యి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో ఎస్‌ఐగా పని చేశారు. సీఐగా పదోన్నతి పొంది గుంటూరు ట్రాఫిక్, బాపట్ల సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లుగా విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో బాలాజీనగర్‌లో పనిచేస్తున్న రాములునాయక్ గుంటూరు రేంజ్ కార్యాలయానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో వీరానాయక్ నియమితులయ్యారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను పూర్తిస్థాయిలో పరిరక్షిస్తామన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే డయల్ 100, 94407 96311 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఆక్రమణలు తొలగించాలని ఆదేశం

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన రోడ్డు మార్గాల్లో ఆక్రమణలను తొలగించి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. స్థానిక కేవీఆర్ పెట్రోల్ బంక్ కూడలి నుంచి జీఎన్‌టీ రోడ్డులోని కరెంటాఫీస్ కూడలి, వేదాయపాళెం, అయ్యప్పగుడి, నేషనల్ హైవే వరకు గురువారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణాల సామగ్రి రోడ్లపై లేకుండా యజమానులను హెచ్చరించాలన్నారు. రోడ్లపై పశువుల సంచారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, డివైడర్లపై పచ్చదనాన్ని పెంపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలధికారులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం



నెల్లూరు రూరల్: నగరంలోని భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. న్యాయవాది సునీల్, ఐఈఆర్‌టీలు మంజుల, శ్రీసంధ్య తదితరులు పాల్గొన్నారు.

అంతా 22 నిమిషాల్లోనే..

- పక్కాగా రెక్కీ వేసి.. ఆపై దోపిడీ
- కేసు నమోదు చేసిన పోలీసులు
- సాంకేతికత ఆధారంగా దర్యాప్తు ముమ్మరం
- తెలిసిన వారి సహకారంతోనే..?
- సొత్తు విలువ రూ.25 లక్షల పైనే..



దోపిడీ జరిగిన వీధి

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలోని దేవిరెడ్డివారి వీధిలో వృద్ధ దంపతులపై దాడి.. దోపిడీ కేసును పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. దొంగలు పక్కాగా రెక్కీ వేసి నిమిషాల వ్యవధిలో సొత్తు దోచుకెళ్లినట్లు గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి. గేవ్‌చంద్ జైన్, విమలాబాయి దంపతులు ఇంట్లోనే కుదువ దుకాణం నిర్వహిస్తున్నారు. గేవ్‌చంద్ వయసు 79 సంవత్సరాలు. వయోభారం కారణంగా వాకర్స్ సహాయంతో నడుస్తున్నారు. బుధవారం రాత్రి ముఖానికి మాస్కులు, చేతికి గ్లౌజ్‌లు ధరించిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు బ్యాగ్‌తో ఇంట్లోకి ప్రవేశించి దంపతులపై దాడి చేసి వారి నోట్లో గుడ్డలు కుక్కి చేతులు కట్టేసి హాల్లోని లాకర్‌లో ఉన్న బంగారు, నగదు అపహరించుకెళ్లారు. సమాచారం అందుకున్న సంతపేట పోలీసులు రంగంలోకి దిగి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెద్ద మొత్తంలోనే..

షాక్‌లో ఉన్న గేవ్‌చంద్ తొలుత రూ.15 వేల నగదు, రూ.1.35 లక్షల విలువైన బంగారు సరుకు అపహరించుకెళ్లారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం స్థిమితంగా ఇంట్లో పరిశీలించగా రూ.25 లక్షలకుపైగా బంగారు ఆభరణాలు, నగదు దోపిడీకి గురైనట్లు గుర్తించారు. దుండగులు పడకగదిలోని బీరువా వద్దకు వెళ్లలేదు. దీంతో అందులోని సుమారు 500 గ్రాముల బంగారు ఆభరణాలు అలాగే ఉన్నట్లు సమాచారం.

రెక్కీ వేసి..

దంపతులిద్దరూ ఒంటరిగా ఉండడం, నడవలేని స్థితిలో ఉండడంతో దోపిడీకి అనుకూలమని భావించిన దుండగులు మూడు, నాలుగురోజులుగా రెక్కీ వేసినట్లు తెలిసింది. మూడురోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తి కుదవపెట్టిన నగలను విడిపించుకునేందుకు వచ్చానని గేవ్‌చంద్ ఇంటికి వెళ్లారు. కుదువకు సంబంధించిన స్లిప్ చూపించాలని అడగ్గా లేదని చెప్పడంతో అది తీసుకురావాలని దుకాణ యజమాని సూచించడంతో ఆ వ్యక్తి వెళ్లిపోయాడు. బుధవారం రాత్రి ముగ్గురు దుండగులు కుదువపెట్టిన నగదలను విడిపించుకునేందుకు వచ్చామని ఇంట్లోకి ప్రవేశించారు. 8.46 గంటల ప్రాంతంలో ఇంట్లోకి ప్రవేశించి దోపిడీ చేసి 9.08 గంటలకు పరారయ్యారు. దోపిడీ జరిగిన తీరును బట్టి బాగా తెలిసిన వారి సహకారంతోనే ఇలా చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.

ఎస్పీ ఆదేశాలతో..

ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాలతో నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి సంతపేట పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి దోపిడీ కేసు దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలు ఘటన జరిగిన ప్రాంతంతోపాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ పుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. అందులో ముగ్గురు దుండగులు చాలాసేపు ఆ ఇంటి వద్ద రెక్కీ చేయడం, దోపిడీ సొమ్ముతో పరారవుతున్న దృశ్యాలను గుర్తించారు. దోపిడీకి ముందు ఓ వ్యక్తి అదే ఇంటి వద్ద చాలాసార్లు తిరగడం, అనంతరం దుండగులు లోపలికి వెళ్లడాన్ని బట్టి చూస్తే అతనే దుండగులకు సహకరించినట్లు పోలీసులు భావిస్తున్నారు. మరో వైపు సెల్ టవర్ డంప్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ తరహా నేరాలకు పాల్పడే వ్యక్తుల వివరాలను సేకరించి వారు ప్రస్తుతం ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారు? తదితరాలపై ఆరా తీస్తున్నారు. సీసీ పుటేజ్‌లో లభ్యమైన నిందితుల చిత్రాలను బాధితులకు చూపించినా వారు గుర్తుపట్టలేకపోతున్నారు.

గతంలోనూ..

గతంలోనూ ఇదే ప్రాంతంలోని ఓ జ్యువెలరీ దుకాణంలో పట్టపగలు దుండగులు తుపాకీతో బెదిరించి రూ.లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు నెలరోజుల వ్యవధిలోనే నిందితులను అరెస్ట్ చేశారు. ఆచారివీధిలోనూ కుదువ వ్యాపారిని దుండగులు హత్య చేసి కేజీకి పైగా బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ ఘటన జరిగి సంవత్సరాలు గడుస్తోంది. నిందితుడు ఎవరో తెలిసినా ఇంతవరకూ అతడి ఆచూకీని గుర్తించలేకపోయారు.